క్లుప్తంగా

చేతుల శుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం

ఇచ్ఛాపురం రూరల్: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. 'గ్లోబల్ హ్యాండ్స్ వాష్ డే' సందర్భంగా మంగళవారం కొఠారీ పంచాయతీలో స్వయం సహాయక సంఘాలు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన చేతులు పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ తమ చేతులను సబ్బుతో పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సెర్ప్ ఇన్‌చార్జి ఏపీఎం పనపల ప్రసాదరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పొందూరు పుష్పలత, జనసేన కన్వీనర్ దాసరి రాజు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్‌అదాలత్


మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

కాశీబుగ్గ: పలాస జూనియర్ సివిల్‌కోర్టులో డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు సివిల్ జడ్జి, పలాస మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు బి.ఎం.ఆర్.ప్రసన్నలత తెలిపారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసు ఉన్నతాధికారులతో మంగళవారం లోక్ అదాలత్‌పై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సివిల్, రాజీపడతగ్గ క్రిమినల్, మనోవర్తి కేసులు రాజీమార్గంతో పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ఈ అవకాశాన్ని న్యాయవాదులు, పోలీసులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఆలయాల ప్రతిష్ట మహోత్సవం


ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వజ్రపుకొత్తూరు రూరల్: చినదోకులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన పాతపట్నం అమ్మవారు, మరిడి అమ్మవారి, చండీ అమ్మవారి ఆలయ, విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ యజ్ఞ, హోమ కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్న క్యాంటిన్ ప్రారంభం


క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి గాంధీపార్కు వద్ద అన్న క్యాంటిన్‌ను ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం ప్రారంభించారు. పేదవాడికి కేవలం ఐదు రూపాయలకే భోజనం అందించి ఆకలి తీర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఎ.రమేష్, తహసీల్దార్ వెంకటరావు, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా జాతీయ పోటీలకు ఐదుగురు ఎంపిక


జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఇచ్ఛాపురం: ఖేలో ఇండియా సౌత్‌జోన్ జాతీయస్థాయి పోటీలకు స్థానిక మున్సిపల్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరు త్వరలో కొయంబత్తూరులో జరగనున్న పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికన రెయ్యి తనూజ, సాడి తేజశ్రీ, గొరైల భవాని, మటం హారిక, గుండ్రటి చందనలను మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మవల్లి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. వీరికి బత్తుల వెంకటరమణ, రామచంద్రారెడ్డిలు ప్రయాణ ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందజేశారు.

కళాకారుడు 'బద్రి'కి సన్మానం


కూర్మారావును సత్కరిస్తున్న అధికారులు

పలాస: పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన కళాకారుడు, గిడుగు రామ్మూర్తి జానపద కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావును విజయనగరం ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. సాహితీ గోష్టిలో 'ఉత్తరాంధ్ర జానపదాలు-విప్లవోద్యమాలపై వాటి ప్రభావం'అనే అంశంపై ప్రసంగించారు.

• మొక్కలు నాటివేత



పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని ఇస్కలపాలెం పంచాయతీ కార్యదర్శి బి.స్వప్న అన్నారు. గ్రామంలోని యువత ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని సచివాలయ సిబ్బంది కోరారు. యువత ప్రతినిధి బి.ఈశ్వరరావు పాల్గొన్నారు.

-సోంపేట

• అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని సోంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్ ఇందిర అన్నారు. కంచిలి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, న్యూట్రి గార్డెన్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సంజీవరావు, మండల యాంకర్ టి.శివానందంలు ఘన, ద్రవ జీవామృతం తయారీలను వివరించారు. ఐసీఆర్‌పీలు బి.పుష్పలత, బి.రోహిణి, జి.మీనా, జి.భవానీ పాల్గొన్నారు.

-కంచిలి

• పొలం పిలుస్తోంది..



పెద్దబాణాపురం, దేవళభద్ర గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పంటల సస్యరక్షణపై నందిగాం మండల వ్యవసాయాధికారి పి.శ్రీకాంత్‌వర్మ వివరించారు. నీటి యాజమాన్య, ఎరువుల యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ సహాయకులు చేసిన ఈ-క్రాప్ జాబితాలను సరి చూసుకోవాలని రైతులకు సూచించారు. వివరాలు తప్పుగా నమోదైతే వీఏఏలకు సమాచారం ఇవ్వాలన్నారు.

-నందిగాం

క్రీడల్




ఇసుకతో ఉన్న కవిటి ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానం

- పూర్తిస్థాయిలో సిబ్బంది
- కానరాని మైదానాలు

కవిటి: విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. తగినంతమంది పీఈటీలు ఉన్నప్పటికీ సరైన క్రీడా మైదానాలు లేకపోవడమే ఈ పరిస్థితికి కారణంగా చెబుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలబాలికలకు సరైన ఆటస్థలాల్లేక వారి శారీరక దారుఢ్యం లోపిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయుల ఉన్నప్పటికీ వారికి నిబంధనల మేరకు ఫిజికల్ ఎడ్యుకేషన్ పిరియడ్లు కేటాయింపులు జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పాఠశాలలు పనిచేస్తున్నాయి. దీంతో స్టడీ అవర్ల నిర్వహణకు ఆటంకం కలుగుతుందనే నెపంతో ఆటలు ఆడించడానికి ప్రధానోపాధ్యాయులు అవకాశం ఇవ్వడం లేదనేది బహిరంగ రహస్యం. పదో తరగతి విద్యార్థులకు కనీసం క్రీడా మైదానం గురించి ఆలోచించే అవకాశం ఉండడం లేదు. ఇక ఆరు నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులు ఆడుకునేందుకు ఆసక్తి ఉన్నప్పటికీ క్రీడా మైదానాలు సౌకర్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. దీంతో ఆటలు ఆడుకోవాలనే లక్ష్యం నెరవేరని పరిస్థితి. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ బడుల్లో ఆటలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి నుంచి విద్యాశాఖ మంత్రి వరకు ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్పా క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 55 గ్రామాల్లో కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ హై స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విభాగాల్లో పనిచేస్తున్న యాజమాన్య పాఠశాలలో నడుస్తున్నాయి. అయితే వీటిని నిశితంగా పరిశీలిస్తే కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం, ఇచ్ఛాపురం మండలం కొలిగాం, బిర్లంగి, ఈదుపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాత్రమే అనువైన విశాలమైన క్రీడా మైదానాలు ఉన్నాయి. మిగిలిన చోట్ల అనువైన క్రీడా మైదానాల్లేక విద్యార్థినీ విద్యార్థులు తరగతి గదులకే పరిమితమవుతున్నారు. క్రీడా సిబ్బంది ఖాళీలను పరిశీలిస్తే ఒకటి, రెండు చోట్లమాత్రమే వ్యాయామ శిక్షకుని పోస్టులు మంజూరు కాలేదు. మిగిలిన అన్నిచోట్లా సిబ్బంది ఫుల్‌గా ఉన్నారు. తగినన్ని క్రీడా మైదానలు లేకపోవడంతో కవిటి ఉద్దానం ప్రాంతంలో కొబ్బరితోటలే చిన్నారులకు ఆటస్థలాలుగా మారాయి. అధికారులు, పాలకులు శ్రద్ధ తీసుకొని పాఠశాలల్లో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


కొబ్బరితోటలో ఆటలాడుతున్న బిగొనపపుట్టుగ పాఠశాల విద్యార్థులు

ఉన్నమేరలో శిక్షణ ఇస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు క్రీడా మైదానాల్లో వివిధ క్రీడాంశాలలో సాధ్యమైనంత మేరలో తర్ఫీదునిస్తున్నాం. అవకాశం ఉన్న మేరకు వారికి ఇష్టమైన ఆటలో ఆడించేందుకు కృషి చేస్తున్నాం. మరింత బాధ్యతగా ముందుకు వెళ్లేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం.

– కె.పద్మనాభరెడ్డి, శ్రీకాకుళం జిల్లా జోన్-1 క్రీడా సంఘం అధ్యక్షుడు

పిల్లల్లో అభ్యాసన వైకల్యాలు గుర్తించాలి


సోంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


కాశీబుగ్గ: హరిపురంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

సోంపేట: విద్యార్థుల్లో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలు గుర్తించి..విద్యాభివృద్ధికి కృషి చేయాలని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు సూచించారు. డిస్లెక్సియా మాసోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, భవిత కేంద్రాల్లో విద్యార్థులతో మంగళవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సోంపేటలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు ఎస్.జొరాడు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

నందిగాం: చిన్నారుల్లో అక్షరాల మధ్య ఉన్న తేడాను గుర్తించలేని స్థితినే డిస్లెక్సియా అంటారని.. దానిపై అవగాహన కల్పించాలని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు యర్నాగుల హరిబాబు అన్నారు. పాఠశాల, భవిత కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమం చేపట్టారు. స్థానిక జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బాడాన మోహనరావు ఉన్నారు.

కాశీబుగ్గ: మందస మండలం హరిపురం హైస్కూల్‌లోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో డిస్లెక్సియాపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బందిడి డిస్లెక్సియాపై అవగాహన కల్పించారు. ఎంఈవోలు తులసీరావు, చిన్నరావు, ప్రధానోపాధ్యాయులు నాగభూషణరావు పాల్గొన్నారు.

అభ్యాసన వైకల్యం పట్ల అవగాహన

వజ్రపుకొత్తూరు రూరల్: డిస్లెక్సియాతో బాధపడుతున్న చిన్నారులకు గుర్తించి వారికి ప్రత్యేకమైన బోధన విధానంతో పాటు సృజనాత్మకతతో కూడిన విద్యను అందించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తారకేశ్వర పండా అన్నారు. అవగాహన ర్యాలీని చేపట్టారు.

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో డిస్లెకియాపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. పట్టణంలో ర్యాలీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు.

చదువుకున్న బడి కోసం..

కాశీబుగ్గ: మందస మండల కేంద్రంలోని శ్రీరాజా శ్రీనివాస మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం పలువురు సాయం అందిస్తున్నారు. సుమారు 125 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. దీంతో దీని ఆనవాళ్లు చెడిపోకుండా.. పాతరూపంలో కోట మాదిరిగా పునః నిర్మాణం చేయాలని పూర్వ విద్యార్థులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా 2003 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. 1,00,116 రూపాయలను పాఠశాల నిర్మాణ కమిటీకి మంగళవారం అందించారు.

గాయపడిన వ్యక్తి మృతి

కాశీబుగ్గ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పలాస మండలం అల్లుకోల గ్రామం వద్ద ఈ నెల 12న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 31వవార్డు సీతారాంనగర్‌కు చెందిన తిప్పాన మురళి (36)కి తీవ్రగాయాలయ్యాయి. శ్రీకాకుళంలో రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని భార్య ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి ట్యాంకు నేలమట్టం

సాక్షి ఎఫెక్ట్...


కూల్చివేసిన మంచినీటి ట్యాంకు

ఇచ్ఛాపురం రూరల్: తేలుకుంచి గ్రామంలో మేరుగు వీధిలోని రక్షిత మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. ప్రమాదం అంచులో ఉండడంతో స్థానికులు భయాందోళన చెందేవారు. దీనిపై గత నెల 13వ తేదీన 'సాక్షి'లో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో కథనాన్ని ప్రచురించాం. దీనికి అధికారులు స్పందించారు. మంగళవారం అధికారుల సమక్షంలో మంచినీటి ఓపెన్ హెడ్ ట్యాంకును నేలమట్టం చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఇదే విషయంపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సంబంధిత అధికారులను నిలదీయడంతో పంచాయతీ నిధులతో ట్యాంకును తొలగించారు.

సాయిబాబా మృతి విప్లవ ఉద్యమానికి తీరనిలోటు

- ప్రజా సంఘాల నాయకులు


సంతాప సభలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

పలాస: ప్రొఫెసర్ జి.ఎన్.సాయిబాబా అకాల మరణం విప్లవ ఉద్యమానికి తీరనిలోటని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక మందిరంలో వివిధ విప్లవ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాయిబాబా సంతాపసభను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి అమరత్వాన్ని కీర్తించారు. గిరిజన, దళిత, ప్రజా హక్కుల పరిరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తిరి దానేసు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ రాష్ట్ర నాయకుడు సాలిన వీరాస్వామి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలక్రిష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్, ఇఫ్టూ నాయకుడు జుత్తు వీరాస్వామి, లిబరేషన్ నాయకుడు మద్దిల మల్లేశ్వరరావు, మద్దిల రామారావు, లిస్‌పియోవో నాయకుడు దున్న గోవిందరావు, టీడీఎఫ్ రాష్ట్ర నాయకుడు కె.ధర్మారావు, కులనిర్మూలన సమితి నాయకుడు ప్రభాకర్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ తదితరులు మాట్లాడారు. మానవ హక్కుల కోసం పోరాడిన ప్రొఫెసర్, దివ్యాంగుడైన సాయిబాబాను అకారణంగా అండాసెల్‌లో పెట్టి చిత్రహింసలకు గురిచేసి ఆయన అకాల మరణానికి రాజ్యమే కారణమైందని ఆరోపించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజాపోరాటాల ద్వారా రాజ్యానికి బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మండల సర్వేయర్‌గా హనుమంతురావు


హనుమంతురావు

నందిగాం: మండల సర్వేయర్‌గా హనుమంతురావు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా నుంచి హనుమంతురావు ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన జోగారావు శ్రీకాకుళం ఏడీ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

సోలార్ రూఫ్ టాప్‌లను వినియోగించుకోవాలి

సోంపేట: ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా అందిస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌లను గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని పలాస ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యఘ్నేశ్వరరావు అన్నారు. సోంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సోంపేట: వరి పంటను ఆశిస్తున్న చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె.జగన్మోహనరావు అన్నారు. ఇస్కలపాలెం, బెంకిలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పొడ తెగులు, ఆకుముడుత పురుగు నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.నర్సింహామూర్తి, వ్యవసాయ సహాయకులు రెడ్ల హరీష్, జయశ్రీ పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కంచిలి: ప్రతి ఒక్కరూ తమ చేతులను ఎప్పుటికప్పుడు సబ్బుతో కడుక్కొని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎం.ఎం.ఎస్. అధ్యక్షురాలు ఎం.లలిత అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు.

గొప్ప దార్శనికుడు అబ్దుల్‌కలాం


కవిటి:పెద్ద ఎర్రగోవిందపుట్టుగలో కలాంకు నివాళులర్పిస్తున్న చిన్నారులు



కవిటి: రక్తదాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఏపీజే అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు


కంచిలి ఉన్నత పాఠశాలలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం సీతారాంనాయుడు


సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహనరావు


ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు ఉన్నత పాఠశాలలో అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


టెక్కలి: గ్రంథాలయంలో కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న పాఠకులు



పలాస: బ్రాహ్మణతర్లాలో కలామ్‌కు ఉపాధ్యాయుల నివాళులు

శాస్త్రవేత్తగా, రాజనీతి కోవిదుడుగా మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడని వక్తలు కొనియాడారు. ఆయనను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అబ్దుల్‌కలాం జయంతోత్సవాన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, గ్రంథాలయాల్లో మంగళవారం నిర్వహిచారు. ఆయన చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కవిటి కేంద్రంగా పనిచేస్తున్న ఏపీజే అబ్దుల్‌కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంత జంక్షన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.